క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



ఆన్‌లైన్ తరగతులను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను విద్యార్థులకందిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల కళాశాలలో అనకాడమీ ఆన్‌లైన్ డిజిటల్ ఎడ్యుకేషన్‌ను శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, ప్రిన్సిపాల్ బి.శ్యామల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, నామాల పోచెట్టి, అరుణ్‌తేజచారి తదితరులు పాల్గొన్నారు.

యోగా ధ్యాన శిబిరం



పాల్గొన్న చిన్నారులు

సిరిసిల్లటౌన్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, తపోవన యోగా కేంద్రం సిరిసిల్ల ఆధ్వర్యంలో ఉచిత యోగా ధ్యాన శిబిరం శనివారం సిరిసిల్లలో నిర్వహించారు. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎలిగేటి కృష్ణ చిన్నారులతో యోగాసనాలు, ధ్యానం చేయించారు. శిక్షకులు సాయికుమార్, అశోక్, మైకేల్, 40 మంది పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చండి

ఇల్లంతకుంట: మీ కంపెనీ లోడ్ వాహనాలు తిరగడంతో రోడ్డు అధ్వానంగా తయారై గుంతలు పడ్డాయని, గుంతలను పూడ్చాలని ప్రతిమ కంపెనీ మేనేజర్‌ను శనివారం రహీంఖాన్‌పేట, వెల్జిపురం గ్రామస్తులు కలిసి విన్నవించారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం

ముస్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ గార్డెన్స్‌లో స్థానిక ఎన్నికల సమాయత్త సమావేశం శనివారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసేవారి నుంచి రిజర్వేషన్ల వారీగా జాబితాను సిద్ధం చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్ చైర్మన్ రాంరెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీను, యాదగిరిగౌడ్, భాను, ప్రశాంత్, నరేశ్, దేవిరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య పురస్కారానికి ఎంపిక

సిరిసిల్లటౌన్: రంగస్థల నటుడు నాగుల మల్లయ్య స్మారకార్థం ఏటా ఇచ్చే ప్రతిభ పురస్కారాలకు ఈయేడు చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని శివనగర్‌లోని సిద్ధార్థ స్కూల్‌లో పురస్కార కమిటీ కోఆర్డినేటర్లు ఎండీ సలీం, నాగుల సంతోష్‌గౌడ్ శనివారం ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని టౌన్ క్లబ్‌లో ఈనెల 4న అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పురస్కార కమిటీ చైర్మన్ నాగుల సత్యనారాయణ హాజరు కానున్నట్లు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా పద్మ

బోయినపల్లి(చొప్పదండి): రత్నంపేట గ్రామానికి చెందిన కొడగాని పద్మను యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పింగళి వెంకయ్య జయంతి

వేములవాడఅర్బన్: న్యూఅర్బన్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో భారత పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడారు.

చందుర్తి: సనుగుల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్, నాతరి నాగమణి పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవం

చందుర్తి: ఆశిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా జాతీయ స్నేహితుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు రజిత స్నేహం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం రైతులతో కలిసి ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 20వ పీఎం కిసాన్ డబ్బులు దేశవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు.



అపూర్వ బంధం స్నేహమే..



సిరిసిల్లటౌన్: పుట్టినప్పటి నుంచి కలకాలం నిలిచిపోయే అపూర్వ బంధమే స్నేహం. 40 ఏళ్లుగా హైస్కూల్ మేట్స్‌ము ఇప్పటికీ ప్రతిరోజు ప్రత్యక్షంగా, పరోక్షంగా కలుసుకుంటాం. వాట్సాప్ వచ్చినప్పటి నుంచి ప్రారంభమైన మా చిన్ననాటి స్నేహితుల గ్రూప్‌లో అందరం సుఖసంతోషాలు పంచుకుంటాం. మారుతున్న సామాజిక పరిస్థితులపై సంభాషించుకుంటాం. ఇతర నగరాల్లో స్థిరపడిన ఫ్రెండ్స్‌తో నెల రోజులకు ఒకసారి కలుసుకుంటాం. అందరికీ వీలయ్యే సెలవు దినాల్లో ఏడాదిలో రెండు, మూడుసార్లు టూర్‌కు వెళ్తాం.

– దుమాల రాంనాథ్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఎస్ గ్రూప్ మాది



ఒకటో తరగతి చదివిన రోజుల్లో కుదిరిన స్నేహం ఇప్పటికీ కొనసాగిస్తున్నాం. నాకు మొదటి స్నేహితురాలు లక్ష్మీతులసి. కానీ పెళ్లయ్యాక నాకు ఆడపడుచైంది. ఇక నేను సులోచన రాణి, మా స్నేహితులు సీతా, సుధీరా, శ్రీనాగవల్లి ఇలా అందరి పేర్లు ఎస్ అక్షరంతోనే ఉంటాయి. మా నలుగురు పిల్లల పేర్లు కూడా ఎస్ అక్షరంతో మొదలయ్యే పేర్లను పెట్టుకొని స్నేహితాన్ని మరిచిపోకుండా ఉంటున్నాం. మందులతో తగ్గని రోగాలు స్నేహితులతో గడిపితే పోతాయి.

– డాక్టర్ కందేపి రాణిప్రసాద్, బాల సాహితీవేత్త

ఫ్రెండ్‌షిప్ లేని జీవితం లేదు



ప్రతీ వ్యక్తికి మంచి ఫ్రెండ్‌షిప్ లేని జీవితం లేదు. కుటుంబ సభ్యులంటే రక్త సంబంధం, చుట్టరికం ఉంటుంది. కానీ ఎలాంటి బంధం లేకుండా జీవితాంతం కలిసి ఉండేదే స్నేహబంధం. టెన్త్, డిగ్రీ, ఎల్ఎల్‌బీ బ్యాచ్‌ల దోస్తులతో ఇప్పటికీ మాట్లాడతా. ఏడాదిలో ఒకసారి కచ్చితంగా కలుసుకొని తీరుతాం. వివిధ సందర్భాల్లో స్నేహితుల కష్టాల్లో పాలుపంచుకున్నాం. మా చిరకాల స్నేహితుడు సర్పంచ్‌గా పోటీ చేస్తే.. దేశ విదేశాల్లో ఉన్న దోస్తులంతా కలిసి గెలిపించుకున్నాం.

– చెక్కిల్ల మహేశ్‌గౌడ్, ప్రముఖ న్యాయవాది

పుణ్యక్షేత్ర దర్శిని

- కార్మిక క్షేత్రం నుంచి ధార్మిక క్షేత్రం
- ఆర్టీసీ ఆధ్యాత్మిక టూర్ ప్యాకేజీ
- సిరిసిల్ల ప్రయాణికుల హర్షం
- నెల రోజుల్లో 9 ట్రిప్పుల యాత్రలు



యాదాద్రి దర్శనం

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: ఆస్తికులకు ఇష్ట దైవాలను సునాయసంగా దర్శించుకునే భాగ్యాన్ని ఆర్టీసీ కల్పించింది. కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల నుంచి వివిధ ధార్మిక క్షేత్రాలను వారం రోజులకోసారి టెంపుల్స్ టూర్ ప్యాకేజీ(టీటీపీ)ని ప్రయాణికులకు కల్పిస్తోంది. తక్కువ బడ్జెట్‌లో ఇష్ట దైవాల క్షేత్రాలను దర్శించుకుంటూ సిరిసిల్ల డిపో పరిధిలోని ప్రజలు ఆధ్యాత్మిక చింతనను ఎంజాయ్ చేస్తున్న వైనంపై సండే స్పెషల్ స్టోరీ మీకోసం.



స్వర్ణగిరిలో సిరిసిల్ల వాసులు

ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీకి ఆదరణ

ఆర్టీసీ అందిస్తున్న పుణ్యక్షేత్రాల సందర్శన ప్యాకేజీకి సిరిసిల్ల డిపో పరిధిలోని ప్రజల నుంచి మంచి ఆదరణ వచ్చింది. ఆర్టీసీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ప్రవేశపెట్టిన టెంపుల్స్ టూర్ ప్యాకేజీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్–1, కరీంనగర్–2, గోదావరిఖని, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, హుజూరాబాద్, హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల డిపోలున్నాయి. ఒక్కో డిపో నుంచి 5 వారాలుగా టెంపుల్స్ టూర్ ప్యాకేజీలో భాగంగా బస్సులను నడిపించారు. సిరిసిల్ల డిపో నుంచి కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఐదు వారాల్లో 9 ట్రిప్పుల బస్సులను నడిపించారు. ఇందులో సిరిసిల్ల నుంచి మానసదేవి ఆలయం, మల్లన్న ఆలయం, సరస్వతి ఆలయం, యాదాద్రి కొండ, స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాలకు 8 బస్సులను సిరిసిల్ల డిపో అధికారులు నడిపించగా.. 320 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక తమిళనాడులోని అరుణాచలం యాత్రకు ఒక బస్సును నడిపించగా.. 40 మంది దర్శించుకున్నారు.

2 ప్యాకేజీల్లో టెంపుల్ టూర్

కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల నుంచి ధార్మిక క్షేత్రాలైన మానసదేవి(ఖాసింపేట), మల్లికార్జునస్వామి(కొమురవెల్లి), సరస్వతి మాత(వర్గల్), నృసింహస్వామి(యాదాద్రి), వేంకటేశ్వరస్వామి(స్వర్ణగిరి) క్షేత్రాలకు ఒకటో టెంపుల్ టూర్ ప్యాకేజీ నడిపిస్తున్నారు. ఇక సిరిసిల్ల నుంచి జోగులాంబ గద్వాల, ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం నుంచి వెల్లూర్ మీదుగా అరుణాచలం క్షేత్రానికి ప్రతి నెలలో పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు భక్తులకు మరో టెంపుల్ టూర్ ప్యాకేజీని నడిపిస్తున్నట్లు సిరిసిల్ల డీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. మొదటి టెంపుల్ టూర్ ప్యాకేజీ సిరిసిల్ల స్వర్ణగిరికి రూ.ఒక్కరికి రూ.750, పిల్లలకు రూ.450, సిరిసిల్ల టూ అరుణాచలంకు రూ.4,100, పిల్లలకు రూ.2,100 చొప్పున చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. రెండు ప్యాకేజీల్లో నిర్ణీత సమయానుకూలంగా బస్సులను నడిపిస్తూ భక్తులకు తమ ఇష్ట దైవాల దర్శనాన్ని కల్పిస్తున్నారు.

టీటీపీ ప్రత్యేకతలివి..

- సిరిసిల్ల నుంచి నేరుగా తాము దర్శించుకోదగ్గ ఇష్ట దైవ క్షేత్రాలను బస్సు ప్రయాణం ద్వారా పొందొచ్చు.
- 30 నుంచి 35 మంది గ్రూప్‌గా వస్తే వారు కోరిన పుణ్యక్షేత్రాలకు బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపిస్తారు.
- సిరిసిల్ల–స్వర్ణగిరి–సిరిసిల్ల ట్రిప్‌లో ఒక డ్రైవర్‌తోపాటు క్షేత్రాలపై అవగాహన కల్పించే ఒక గైడ్‌తో ఆయా ఆలయాల్లో దర్శనాలు కల్పిస్తున్నారు.
- ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం కన్నా.. తక్కువ చార్జీలతో సుఖవంతమైన ప్రయాణం భక్తులకు అందుతోంది.
- ఒక్కరు కూడా దైవ దర్శనాలకు వెళ్లొచ్చు. ఆర్టీసీ టీటీపీలో ఒక్కరు వెళ్లినా.. ఇతర భక్తులతో కలిసి దైవ దర్శనం అవుతుంది కాబట్టి ఒంటరిగా దర్శనం చేసుకున్నామన్న బాధ ఉండదు.
- త్వరలోనే భద్రాచలం, అన్నవరం, వరంగల్–లక్నవరం తదితర క్షేత్రాలకు బస్సులు నడిపే యోచనలో అధికారులున్నారు.
- అన్ని క్షేత్రాల్లో సునాయాసంగా దైవ దర్శనాలు చేసుకునే వీలుంది. ఏదైనా ఒక పుణ్యక్షేత్రంలో భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు.

సౌకర్యంగా ఉంది



ప్రస్తుతం స్వర్ణగిరి, అరుణాచల గిరి ప్రదక్షణల టూర్ ప్యాకేజీలు బాగానే ఉన్నాయి. బస్సులో సిరిసిల్ల ప్రయాణికులతో ప్రయాణం కాబట్టి ఒంటరి అన్న భావన లేదు. భవిష్యత్తులో భద్రాచలం, అన్నవరం తదితర క్షేత్రాలకు బస్సులు నడపాలి. ఆర్టీసీ ఆలోచన విధానం భక్తులకు సౌకర్యంగా ఉంది.

– చంద్రకాంత్, సిరిసిల్ల

అభినందనీయం



పుణ్యక్షేత్రాలకు ప్రైవేటు వాహనాల కన్నా.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం అలసట లేకుండా శరీరానికి సౌలభ్యంగా ఉంది. సాధారణ చార్జీలతోనే ఆధ్యాత్మిక యాత్రలు చేసే వీలు కల్పించారు. నిర్భయంగా మహిళలు, పిల్లలు, పెద్దలు ఆర్టీసీ టెంపుల్ టూర్‌కు వెళ్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని యాత్రలు కూడా ఆర్టీసీ ద్వారా చేయాలనుకుంటున్నాం. ఆర్టీసీ అధికారుల సేవలు అభినందనీయం.

– భావన, సిరిసిల్ల

మరిన్ని సేవలు



సిరిసిల్ల నుంచి స్వర్ణగిరి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వేర్వేరుగా బస్సులు నడిపిస్తున్నాం. మంచి కండీషన్‌లో పుష్‌బ్యాక్ సీట్లు గల డీలక్సు సర్వీసుల్లో ప్రయాణికులను దైవ దర్శనాలకు తీసుకెళ్తున్నాం. మరిన్ని రూట్లలో బస్సులు నడిపించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరతాం. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన టీటీపీలో సిరిసిల్ల డిపో నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు అందిస్తే మరిన్ని సేవలందిస్తాం.

– ఎ.ప్రకాశ్‌రావు, డీఎం, సిరిసిల్ల



బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డులో స్థానిక భూమయ్య హోటల్ ముందు రోడ్డుపైకి ఓ పెద్ద చెట్టు కొమ్మ వచ్చింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన క్రమంలో ప్రమాదం జరిగే అవకాశముంది. చెట్టు మండలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అనిల్, పంచాయతీ కార్యదర్శి, బోయినపల్లి, సెల్ నంబర్: 8897231373

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

హలో.. నేను కార్యదర్శిని మాట్లాడుతున్న..

- ఫోన్ చేసి బెదిరింపులకు దిగిన వైనం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి, సారంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ సమీర్ తీరు మారలేదు. పంచాయతీ కార్యదర్శులు డీఎస్‌ఆర్ అటెండెన్స్ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్నారని అర్ధనగ్నంగా ఫొటోలు అప్లోడ్ చేసిన విషయాన్ని తెలుపుతూ ప్రజెంట్ సార్ శీర్షికతో శనివారం సాక్షి కథనాన్ని ప్రచురించింది. సాక్షి పేపర్ క్లిప్పింగ్‌ను వాట్సాప్ గ్రూపులో షేర్ చేసిన వ్యక్తితో సమీర్ ఫోన్ సంభాషణ ఇలా సాగింది. హలో నేను తంగళ్లపల్లి సెక్రటరీని. సాక్షి పేపర్ క్లిప్పింగ్ పెట్టారు కదా.. ఒకసారి నన్ను అడిగితే నేను చెప్తాను కదా. వాస్తవానికి యాప్ అనేది వివేకానందకాలనీలో ఓపెన్ అవుతుంది. గ్రామ పంచాయతీ వద్ద ఓపెన్ కాదు. నేను పొద్దున 6 నుంచి సాయంత్రం వరకు ఫీల్డు మీదే ఉంటా. ఊర్లో ఎవరినైనా అడగండి. నేను తంగళ్లపల్లి లోకల్ వాడిని. ఇందిరమ్మ ఇళ్ల 54 కొట్టాను. ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అక్కడ ఏం అర్ధనగ్నంగా కనబడుతోంది. నా బొడ్డు కనబడుతుందా. నా కింద పార్టులు కనబడుతున్నాయా. రెడ్ కలర్ టీషర్టు వేసుకున్నా అంటూ ఒక వ్యక్తిని బెదిరించేందుకు యత్నించాడు. ఎంపీడీవో లక్ష్మీనారాయణను సాక్షి వివరణ కోరగా.. సమీర్‌ను వివరణ అడిగామని, టీషర్టు వేసుకొని ఫొటో దిగానని చెప్పాడని తెలిపారు.



ప్రజెంట్ సార్...
అర్ధనగ్నంగా సెల్ఫీ దిగి..
పంచాయతీ కార్యదర్శి నిర్వాకం..

సాక్షిలో ప్రచురితమైన కథనం

స్టార్టర్ తీగ దొంగిలించిన దుండగులు

ఇల్లంతకుంట: దాచారం, పెద్ద లింగాపురం గ్రామాల్లో స్టార్టర్ నుంచి బోరు మోటార్ వరకు వెళ్లే తీగ గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి దొంగిలించారని గ్రామస్తులు శనివారం తెలిపారు. దాచారం గ్రామంలోని కొమ్ముల ప్రశాంత్, రగుడ నరసయ్యకు చెందిన స్టార్టర్ తీగ, పెద్ద లింగాపురంలో కిషన్‌రెడ్డికి చెందిన స్టార్టర్ తీగ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించాలన్నారు. ఈ తీగ ఒక మీటరు రూ.300 ఉంటుందని, దాదాపు 3 స్టార్టర్ల వద్ద నుంచి పోయిన తీగ 50 గజాల వరకుంటుందని పేర్కొన్నారు. పోలీస్ కానిస్టేబుల్‌కు సమాచారమందించనున్నట్టు దాచారంకు చెందిన ఏఎంసీ డైరెక్టర్ నర్సింగం తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని బతుకమ్మ తెప్ప వద్ద శనివారం గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వ్యక్తిని అరెస్టు చేసినట్టు జిల్లా రూరల్ సీఐ మొగిలి తెలిపారు. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. చింతలకుంటపల్లె గ్రామానికి చెందిన మాతంగి మనీష్ కరీంనగర్‌లోని వాటర్ ప్లాంట్‌లో పని చేస్తూ జల్సాలకు అలవాటు పడి డబ్బులు సంపాదించాలనే భావనతో కరీంనగర్లో ఒక వ్యక్తి వద్ద గంజాయి కొని ఇల్లంతకుంటలో అమ్ముతున్నట్టు తెలిపారు. మనీష్ వద్ద 110 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టుకు పంపించామన్నారు. ఎస్సై శ్రీనివాసరావు ఉన్నారు.

దళిత జర్నలిస్టుపై నిషేధం ఎత్తెయ్యాలి

సిరిసిల్ల అర్బన్: దళిత జర్నలిస్ట్ బాలు కాయితిపై విధించిన బీఎన్‌ఎస్ 163ను వెంటనే ఎత్తేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు అధ్యక్షతన దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టులు, దళిత ఉద్యోగస్తులు, దళితులపై జరుగుతున్న దాడులను ఖండించారు. సుదర్శన్, చాకలి రమేశ్, జక్కుల రామచంద్రం, వెంకట్, అనిల్, సుమన్, గజ్జల అశోక్, సురేశ్‌నాయక్, గూడెం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో రాజేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 34 మంది విద్యార్థులకు టై, షూస్, బెల్టులు శనివారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ కె.రాజేశ్ ఆధ్వర్యంలో అందించారు.

సైకిళ్లు..

తంగళ్లపల్లి: మండెపల్లి, తాడూర్ ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్ మాట్లాడారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా సీఎస్‌ఆర్ నిధులతో మోదీ గిఫ్ట్ పేరుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ల సాధనకు ఉద్యమం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దివ్యాంగుల పెన్షన్ల సాధనకు ఉద్యమాలు చేపడతామని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కానపూరం లక్ష్మణ్ అన్నారు. దుమాలలో శనివారం దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. శోభారాణి, శరవిందు, సంజీవ్, రాజిరెడ్డి, మల్లయ్య, భూలక్ష్మి, మల్లవ్వ, నారాయణ, రాజం తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

వేములవాడరూరల్: మల్లారం పంచాయతీ ఆవరణలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. 79 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం

ఎల్లారెడ్డిపేట: జాతీయ సేవాపథకంలో చేరడం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం పెంపొందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు. ఎల్లారెడ్డిపేట కళాశాలలో ఎన్ఎస్ఎస్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు.

తల్లి పాల వారోత్సవాలు

వేములవాడరూరల్: లింగంపల్లి గ్రామంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కవిత, తిరుపతిరెడ్డి, అంగన్వాడీ టీచర్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అందని యూరియా

ఎల్లారెడ్డిపేట: రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

ముస్తాబాద్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. పోతుగల్ ఏఎంసీ పాలకవర్గ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం జరిగింది. రైతులకు గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందించేందుకు మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించామన్నారు. యార్డు ఆవరణలో వన మహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, కార్యదర్శి హరినాథ్, డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, కొంరయ్య, ముజ్యానాయక్, యాదగిరిరెడ్డి, క్యారం రాజు, సత్తయ్యగౌడ్, బొప్ప శంకర్, నల్ల బుచ్చయ్య, సిబ్బంది నిషాంత్‌రావు, నర్సింలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో ఏఎంసీ చైర్‌పర్సన్ రాణి

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ నిర్వహించుకోవడం ఎంతో అవసరమని ఎంపీడీవో శశికళ అన్నారు. కందికట్కూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన వన మహోత్సవం, కిచెన్ గార్డెన్లో భాగంగా చెట్లను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. హెచ్ఎం బద్దం రవీందర్ రెడ్డి, రాజు, అంగన్వాడీ టీచర్, లక్ష్మి, కారోబార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజికల్ బ్యాండ్ వితరణ



రుద్రంగి(కోనరావుపేట): కోనరావుపేట మండలం నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు లంబ రాజు రూ.6వేలు విలువైన మ్యూజికల్ బ్యాండ్ అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షాబొద్దీన్‌కు అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, నాయకులు తిరుపతి, సలీం, మనోహర్, అనిల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిరాహార దీక్షల నోటీసు అందజేత

ఇల్లంతకుంట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6, 7ల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు మండల మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయ సిబ్బందికి శనివారం నోటీసు అందజేశారు. 10 నెలల నుంచి తమకు బిల్లులు రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అంశాలు నెరవేర్చడం లేదని నిరసిస్తూ నిరాహార దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్టు మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎస్.లక్ష్మి, బాలమణి, వసంత, రేణుక, సీహెచ్ లత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు..

సిరిసిల్ల అర్బన్: ఒకటో వార్డు రగుడులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులను కాంగ్రెస్ నాయకుడు బూర యాదగిరి లబ్ధిదారులకు అందజేశారు. రేషన్ డీలర్, నాయకుడు బూర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: నర్మాలలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను శనివారం లబ్ధిదారుల ఇంటికెళ్లి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ రాజనర్సు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఒరుగంటి నర్సింలు, జిల్లా నాయకుడు నిమ్మల తిరుపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: దేశాయిపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. బోయినపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి మాట్లాడారు. మాజీ సర్పంచ్ ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, ఎమిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

చెక్కులు..

కోనరావుపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య పంపిణీ చేశారు.

24 గంటలు వైద్యమందించాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో 24 గంటలు వైద్యమందించాలని మాజీ సర్పంచ్ ఓగ్గు నర్సయ్య అన్నారు. శనివారం ఇల్లంతకుంటలో మాట్లాడారు.

ఎంపీ నిధులతో బోర్లు

ఎల్లారెడ్డిపేట: సింగారం, బాకుర్‌పల్లితండాల్లో ఎంపీ బండి సంజయ్ నిధులతో బోర్లు వేయించామని బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు విద్యావలంటీర్

సాక్షి స్పందన

ముస్తాబాద్: పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో విద్యావలంటీర్‌ను మాజీ సర్పంచ్ తన్నీరు గౌతంరావు ఏర్పాటు చేశారు. సాక్షిలో సర్కార్ బడి.. సమస్యల ఒడి శీర్షికన ప్రచురితమైన కథనానికి గౌతంరావు స్పందించారు. ఐదు తరగతుల్లో 60 మంది విద్యార్థులకు ముగ్గురే టీచర్లుండడంతో.. నాగలక్ష్మి అనే విద్యావలంటీర్‌ను నియమించామని గౌతంరావు తెలిపారు. టీచర్‌కు ప్రతి నెల రూ.5వేలు ఇస్తానని ప్రకటించారు.

విద్యార్థులు బాగా చదవాలి

వీర్నపల్లి: రంగంపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాధికారి శ్రీనివాస్ సందర్శించారు. విద్యార్థులు బాగా చదువుకొని పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899